సాక్షి గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)

శనివారం । 21 । సెప్టెంబర్ । 2024

పువ్వు ఇచ్చి.. పలకరించి

హన్మకొండ: ప్రయాణికులకు పువ్వులు ఇచ్చి.. పలకరించి ఆర్టీసీ అధికారులు సందడి చేశారు. కర్టసీ డేలో భాగంగా శుక్రవారం హనుమకొండ బస్‌స్టేషన్‌లో, బస్సుల్లో ఆర్‌ఎం విజయ భాను, అధికారులు.. ప్రయాణికులను కలిసి పూలు అందజేశారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తున్నందుకు శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రయాణికులే సంస్థకు ఆస్తి అని, వారిపై గౌరవభావాన్ని కలిగి ఉందామని పేర్కొన్నారు. ప్రయాణికులను ఆర్టీసీ మర్యాదగా చూసుకుంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఆర్‌ఎం కేశరాజు భానుకిరణ్, వరంగల్–1 డిపో మేనేజర్ వంగల మోహన్‌రావు, హనుమకొండ డిపో మేనేజర్ ధరంసింగ్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ప్రయాణికులకు పూలు అందించి శుభాకాంక్షలు తెలుపుతున్న ఆర్‌ఎం విజయభాను

న్యూస్‌రీల్

ఆర్ట్స్ కళాశాలలో విభాగాధిపతుల నియామకం



కేయూ క్యాంపస్: కేయూ పరిధి హనుమకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఇంగ్లిష్, మ్యాథ్స్, కంప్యూటర్ సైన్స్ విభాగాల అధిపతులను నియమిస్తూ ఆకళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.జ్యోతి శుక్రవారం ఉత్తర్వులు అందించారు. ఇంగ్లిష్ విభాగాధిపతిగా జె.చందులాల్, మ్యాథ్స్ విభాగాధిపతిగా డాక్టర్ టి.నాగయ్యను, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతిగా రెహమాన్‌ను నియమించారు. వీరు ఈపదవిలో ఏడాది పాటు కొనసాగుతారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆకళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పుల్లా రమేశ్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ పెండ్లి అశోక్‌బాబు పాల్గొన్నారు.

23న కేయూలో సింపోజియం

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని ఎకనామిక్స్ విభాగం ఆధ్వర్యంలో ఈనెల 23న ఉదయం 10 గంటలకు సింపోజియం నిర్వహించనున్నారు. క్యాంపస్‌లోని పరిపాలనా భవనంలోని సెనెట్‌హాల్‌లో నిర్వహించే ఈ సింపోజియం 'డికేడల్ డెవలప్‌మెంట్ ఆఫ్ తెలంగాణ స్టేట్–ఇష్యూస్ అండ్ చాలెంజెస్' అంశంపై కొనసాగుతుంది. ముఖ్య అతిథిగా యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ రిటైర్డ్ ఆచార్యులు, సామాజికవేత్త ప్రొఫెసర్ జి.హరగోపాల్, స్పెషల్ గెస్ట్‌గా ఎమ్మెల్సీ ప్రొఫెసర్ ఎం.కోదండరాం పాల్గొననున్నారు. యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ ప్రొఫెసర్ డి.నర్సింహారెడ్డి కీలకపోన్యాసం చేస్తారు. ఈ సింపోజియానికి కేయూ ఎకనామిక్స్ విభాగాధిపతి, బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్ ఆచార్య బి.సురేశ్‌లాల్ అధ్యక్షత వహిస్తారు. అన్ని విభాగాల అధిపతులు, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు హాజరుకావాలని నిర్వాహకులు కోరారు.

పోషణ లోప రహిత జిల్లాగా తీర్చిదిద్దుదాం..



కాజీపేట అర్బన్: హనుమకొండ జిల్లాను పోషణ లోప రహిత జిల్లాగా తీర్చిదిద్దుదామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కె.లలితాదేవి పిలుపునిచ్చారు. హనుమకొండ కలెక్టరేట్‌లోని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు సమావేశంలో లలితాదేవి మాట్లాడు తూ.. ఆరోగ్య శాఖ సమన్వయంతో అంగన్వాడీలు జిల్లాలోని పీహెచ్‌సీల్లో ఆరేళ్ల లోపు పిల్లల పోషణ లోపాన్ని గుర్తించి, ఆరోగ్య పరీక్షలను నిర్వహించాలని తెలిపారు. గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో గర్భిణులు, బాలింతలు, కిషో ర బాలికలతో పాటు అన్ని వయస్సుల వారికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో స్త్రీ, శిశు సంక్షేమాధికారి రాజమణి, అంగన్వాడీ సూపర్‌వైజర్లు, పోషణ్ అభియాన్ టీం పాల్గొన్నారు.

విద్యార్థులకు ఎయిడ్స్‌పై అవగాహన ఉండాలి : డీఈఓ

విద్యారణ్యపురి: విద్యార్థి దశలోనే ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలని డీఈఓ వాసంతి అన్నారు. హనుమకొండలోని ప్రభుత్వ ప్రాక్టీసింగ్ పాఠశాలలో శుక్రవారం హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై జిల్లా స్థాయి పోస్టర్ మేకింగ్ పోటీలు నిర్వహించారు. ఇందులో తేజస్వి పబ్లిక్ స్కూల్‌కు చెందిన ఎల్.విధాత్రి మొదటి బహుమతి, హసన్‌పర్తి కేజీబీవీ విద్యార్థి ఎం.శరణ్య ద్వితీయ బహుమతి సాధించారు. వీరికి బహుమతులు, ప్రశంసపత్రాలను జిల్లా క్వాలిటీ కో–ఆర్డినేటర్ ఎ.శ్రీనివాస్ అందజేశారు. జిల్లా ఆరోగ్య విద్యాధికారి ఎస్.శ్రీనివాస్, జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ స్వప్న మాధురి హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌తో కలిగే అనర్థాలను, జీవన నైపుణ్యాలపై విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి ఎస్.శ్రీనివాస్‌స్వామి, ఉపాధ్యాయులు మధుసూదన్‌రెడ్డి, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

కీటక జనిత వ్యాధులను నియంత్రించాలి

డీఎంహెచ్‌ఓ వెంకటరమణ

మామునూరు: కీటక జనిత వ్యాధులను నియంత్రించాలని డీఎంహెచ్ ఓ కాజీపేట వెంకటరమణ సూచించారు. శుక్రవారం ఆయన ఖిలా వరంగల్ మండలం మామునూరు పోలీస్ శిక్షణ కళాశాలను వైద్య, ఆరోగ్యశాఖ అధికా రులతో కలిసి సందర్శించారు. డెంగీతో బాధపడుతున్న శిక్షణ మహిళా కానిస్టేబుల్‌ను పరీక్షించి వైద్యపరమైన సూచనలు చేశారు. అనంతరం పీటీసీ ప్రాంగణంలో దోమల నివారణకు చేపట్టిన పైరిత్రం స్ప్రే పనులు పరిశీలించారు. కాచి చల్లార్చిన నీటినే తాగాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ మోహన్‌సింగ్, డాక్టర్ బి.సుధీర్, మాడిశెట్టి శ్రీనివాస్, ఖాసీం, కలీం పాల్గొన్నారు.


నేడు, రేపు కేంద్ర మంత్రి జార్జి కురియన్ పర్యటన

హన్మకొండ: కేంద్ర మైనారిటీ, పశుసంవర్థక, పాడి పరిశ్రమ, మత్స్యశాఖ సహాయ మంత్రి జార్జి కురియన్ ఈనెల 21, 22 తేదీల్లో ఉమ్మడి వరంగల్ జిల్లాలో పర్యటించనున్నట్లు బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ సంఘం చైర్మన్ మార్తినేని ధర్మారావు తెలిపారు. శనివారం మధ్యాహ్నం 12.30 గంటలకు హనుమకొండలోని అశోక హోటల్‌లో జరిగే పార్టీ రైతుల సమావేశంలో మంత్రి పాల్గొంటారు. మధ్యాహ్నం 3 గంటలకు మీడియా సమావేశం, సాయంత్రం 4.30 గంటలకు వరంగల్‌లో జరిగే బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొని రాత్రి కాజీపేట నిట్‌లో బస చేస్తారు. 22న ఉదయం కాజీపేట క్యాథలిక్ చర్చిని సందర్శిస్తారు. ఉదయం 10.30 గంటలకు ములుగు జిల్లా రామప్పకు చేరుకుంటారు. దేవాలయాన్ని సందర్శించిన అనంతరం అక్కడ జరిగే ములుగు, భూపాలపల్లి జిల్లాల పార్టీ సమావేశంలో పాల్గొంటారు. అనంతరం మహబూబాబాద్ చేరుకుని స్థానికంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం తిరుగు ప్రయాణం చేయనున్నారని ధర్మారావు వివరించారు.

ఎట్టకేలకు కొత్త కార్డులు

రేషన్ కార్డులపై ఆరేళ్ల తర్వాత ప్రకటన

- విధివిధానాలపై సీఎం ఉన్నతస్థాయి సమీక్ష
- ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం 11.18 లక్షలు.. పెండింగ్‌లో 27,939 దరఖాస్తులు
- కొత్త నోటిఫికేషన్‌తో ఇంకా పెరిగే అవకాశం
- అక్టోబర్ 2 నుంచి దరఖాస్తుల స్వీకరణ



సాక్షిప్రతినిధి, వరంగల్ : ఆరేళ్ల తర్వాత ఎట్టకేలకు కొత్త రేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియకు కసరత్తు మొదలైంది. రాష్ట్రంలో తొమ్మిది నెలల క్రితం ఏర్పడిన కాంగ్రెస్ సర్కారు తాత్కాలిక కూపన్లు కలిగిన వారికి బియ్యం, నిత్యావసర సరుకులు సరఫరా చేస్తోంది. అయితే, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు రేషన్ కార్డు ముడిపడటంతో కార్డుల జారీ అనివార్యంగా మారింది. దీంతో అక్టోబర్ 2 నుంచి దరఖాస్తులు స్వీకరించి ఈ ఏడాది డిసెంబర్.. లేదా వచ్చే ఏడాది జనవరిలో కొత్త రేషన్ కార్డులు ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఇందుకు సంబంధించిన విధివిధానాలపై గురువారం సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించిన సీఎం రేవంత్‌రెడ్డి.. అర్హులందరికీ డిజిటల్ రేషన్ కార్డులు ఇవ్వడానికి కసరత్తు చేయాలని సూచించారు. దీంతో అర్హుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

2021లో దరఖాస్తులు స్వీకరించినా..

ఆహార భద్రత కార్డులో నమోదైన ప్రతీ వ్యక్తికి ఆరు కేజీల చొప్పున, అంత్యోదయ కార్డు కుటుంబానికి 35 కేజీలు, అన్నపూర్ణ కార్డు ద్వారా ఒక్కో సభ్యుడికి 10 కేజీల చొప్పున కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి 2020 కరోనా నుంచి ఉచితంగా బియ్యం సరఫరా చేస్తున్నాయి. మరో వైపు ప్రతీ పథకానికి రేషన్ కార్డులు ప్రామాణికం కావడంతో ప్రతి నెలా దరఖాస్తు చేసుకునే వారుంటున్నారు. అయితే, బీఆర్‌ఎస్ ప్రభుత్వం 2018 నుంచి కొత్త రేషన్ కార్డుల జారీ నిలిపివేసింది. కేవలం మార్పులకు అవకాశం కల్పించింది. అప్పుడు ఉమ్మడి జిల్లాలో మొత్తం 11,17,519 కార్డులు ఉన్నాయి. కొత్తగా 2021లో అర్హులకు మాత్రమే తాత్కాలిక కార్డులు జారీ చేయాలని ప్రభుత్వం ఆదేశించగా 34,069 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. మండలాల్లో ఆర్‌ఐలు క్షేత్రస్థాయికి వెళ్లి అర్హులా? కాదా? అని పరిశీలించారు. ఆధార్ ఆధారంగా ఆస్తులు, వాహనాలు, ఆదాయపన్ను వివరాలు సేకరించారు. పరిశీలనలో వివిధ కారణాలతో 6,130 దరఖాస్తులను తిరస్కరించి 27,939 మందిని అర్హులుగా గుర్తించారు. వారికి కూడా కార్డులు జారీ చేయలేదు.

కీలకంగా మారిన 'రేషన్ కార్డు'..

ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలు పొందాలంటే అర్హులకు రేషన్‌కార్డు తప్పనిసరిగా మారింది. నిన్నటి వరకు సాగిన రైతు రుణమాఫీ పథకం మొదలుకుంటే.. రాజీవ్ ఆరోగ్యశ్రీ, ఇందిరమ్మ ఇల్లు, గృహజ్యోతి, మహిళలకు ప్రతినెలా రూ.2,500, యువ వికాసం, గృహలక్ష్మి తదితర పథకాల వరకు అన్నింటికీ రేషన్‌కార్డే ప్రామాణికంగా మారింది. దీంతో రేషన్‌కార్డు కీలకంగా మారగా.. ప్రభుత్వ ప్రకటన వెలువడమే తరువాయి దరఖాస్తు చేసుకోవడానికి ప్రజలు సన్నద్ధమవుతున్నారు. ఇదిలా ఉండగా.. రేషన్‌కార్డుల జారీకి గతంలో గ్రామీణ, అర్బన్ ఏరియాలుగా వార్షిక ఆదాయ పరిమితి ఆధారంగానే తెల్ల రేషన్‌కార్డులు ఇచ్చారు. గ్రామీణ ప్రాంతంలో రూ.1.50 లక్షలు, అర్బన్ రూ.2 లక్షల్లోపు ఆదాయాన్ని కార్డుల జారీకి ప్రాతిపదికగా తీసుకున్నారు. భూ విస్తీర్ణం తరి భూమి అయితే 3.5 ఎకరాలు, మాగాణి భూమి అయితే 7.5 ఎకరాల్లోపు ఉండాలనే నిబంధనలు అమలు చేశారు. ఇప్పుడవే నిబంధనలు అమలు చేస్తారా? కొత్త మార్గదర్శకాలు నిర్దేశిస్తారా? అన్న అంశాలపై కూడా నేడోరేపో స్పష్టత వచ్చే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

అర్హులందరికీ రేషన్ కార్డులివ్వాలి



కమలాపూర్‌కు చెందిన పుల్లా కుమారస్వామితో 2020లో నాకు వివాహంఅయింది. గతంలో రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకున్నాం. ఇప్పటి వరకు కార్డు ఇవ్వలేదు. అక్టోబర్ 2 నుంచి మళ్లీ దరఖాస్తులు తీసుకుంటామని రాష్ట్ర ప్రభుత్వం చెబుతోంది. ఈసారైనా దరఖాస్తులు తీసుకోవడం వరకే పరిమితం చేయకుండా అర్హులకు తప్పనిసరిగా రేషన్ కార్డులు ఇవ్వాలి. - పుల్లా అనిత, కమలాపూర్

రెండుసార్లు దరఖాస్తు పెట్టుకున్నా..



నాకు వివాహం అయి ఐదేళ్లు అవుతున్నా రేషన్ కార్డు రాలేదు. అన్నింటికీ రేషన్ కార్డు లింకు పెట్టడంతో తల్లిదండ్రుల కార్డులోని నా పేరు డిలిట్ చేయించి రెండుసార్లు మీ సేవా కేంద్రం, ప్రజాపాలన ద్వారా దరఖాస్తు పెట్టుకున్నా ప్రయోజనం లేదు. ఈసారైనా కార్డు వస్తుందని ఆశిస్తున్నాను. - మూగల మల్లికార్జున్, పరకాల

పదేళ్లుగా ఎదురుచూస్తున్నాం..



మాకు రేషన్ కార్డు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. పదేళ్లుగా ఎదురుచూస్తున్నాం. అర్హులందరికీ కొత్త రేషన్ కార్డుల జారీకి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడాన్ని సంతోషిస్తున్నాం. అక్టోబర్ 2న దరఖాస్తు చేసుకుంటాం. - వడ్లకొండ సరిత, లెనిన్‌నగర్, వరంగల్

సొసైటీ భూమి స్వాధీనం

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం అన్నాసాగరంలో కబ్జాకు గురైన సొసైటీ భూమిని ఆ శాఖ అధికారులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. 'సొసైటీ భూమి అమ్మకం' శీర్షికన 'సాక్షి'లో ఇటీవల ప్రచురితమైన కథనానికి కలెక్టర్ ప్రావీణ్య, ఎమ్మెల్యే కే.ఆర్.నాగరాజు స్పందించారు. ఈమేరకు కొనుగోలు చేసిన భూమిఎంత? ఎప్పుడు కొనుగోలు చేశారు? ఏమేరకు డబ్బులు ఇచ్చారు? కొనుగోలు చేసిన దస్తావేజులు అందుబాటులో ఉన్నాయా? అనే వివరాలు పరిశీలించారు. అనంతరం భూమి స్వాధీనానికి స్థానిక తహసీల్దార్‌తో పాటు జిల్లా సహకార సంఘం అధికారికి ఆదేశాలిచ్చారు. దీంతో ప్రాథమిక సహకార సంఘం సీఈఓ శ్రీనివాస్‌రెడ్డి, పరమేశ్ శుక్రవారం క్షేత్రస్థాయికి వెళ్లి జేసీబీతో భూమి చదును చేయిస్తుండగా.. కబ్జాదారులు(భూమి అమ్మిన పట్టాదారులు) అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఇరువురి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. సొసైటీ ఖరీదు చేసిన దస్తావేజులు పరిశీలించారు. అడ్డుకుంటే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.



ట్రెంచ్ కొడుతున్న జేసీబీ

అభివృద్ధి పనుల్లో వేగం పెంచండి

నయీంనగర్/హన్మకొండ కల్చరల్: కాకతీయ పట్టణ అభివృద్ధి సంస్థ అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని 'కుడా' చైర్మన్ ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన 'కుడా' వైస్ చైర్‌పర్సన్ అశ్విని తానాజీ వాకడేతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించి పలు అభివృద్ధి పనులు పరిశీలించారు. పర్యటనలో భాగంగా వారు అగ్గలయ్య గుట్ట, జైన ఆలయం గుట్టను పరిశీలించి ఆలయ ఆవరణ పరిశుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. సరిగమప పార్కు, పద్మాక్షి ఆలయం అప్రోచ్ రోడ్డును పరిశీలించి బతుకమ్మ పండుగ దృష్ట్యా కొలనులో పేరుకుపోయిన గుర్రపు డెక్కను యుద్ధప్రాతిపదికన తొలగించాలని అధికారులను ఆదేశించారు. భద్రకాళి బండ్‌పై నూతనంగా నిర్మిస్తున్న ఎంట్రెన్స్ లైటింగ్, డి–జోన్‌లో కొనసాగుతున్న పనుల్ని పరిశీలించి వేగంగా పూర్తి చేయాలన్నారు. కాకతీయ మ్యూజికల్ గార్డెన్‌లో ఆవరణ పరిశుభ్రంగా ఉంచాలని, ఫౌంటేన్ ఏర్పాటు, గ్రీనరీ పెంచి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలన్నారు. భద్రకాళి ఆలయంలో పూజలు చేసి మాఢ వీధుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. రుద్రేశ్వర స్వామి వేయిస్తంభాల దేవాలయ పరిసరాలు, హంటర్‌రోడ్ డి–కన్వెన్షన్ పక్కన ఉన్న 'కుడా'కు చెందిన ఖాళీ స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో 'కుడా' సీపీఓ అజిత్‌రెడ్డి, ఈఈ భీమ్‌రావు, ఏఈ సిద్ధార్థ్ నాయక్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



పద్మాక్షి గుట్ట ఆలయ కొలనును పరిశీలిస్తున్న 'కుడా' చైర్మన్ ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి

కనీస ప్రమాణాలు పాటించాలి

- అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి

హన్మకొండ అర్బన్ : బాలల సంరక్షణ కేంద్రాలు(చైల్డ్ కేర్ ఇన్‌స్టిట్యూషన్స్) కనీస ప్రమాణాలు పాటించాలని హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా తనిఖీ(ఇన్‌స్పెక్షన్) కమిటీ, బాలల సంరక్షణ కేంద్రాల నిర్వాహకుల సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రాల నిర్వాహకులు ఆశ్రయం పొందుతున్న బాల బాలికలకు వసతి, భోజనం, విద్య, వైద్యంతో పాటు సరైన వసతులు కల్పించాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో తీసుకోబోయే చర్యల గురించి వివిధ శాఖల టోల్ ఫ్రీ నంబర్లను ప్రదర్శించాలని సూచించారు. ఇదిలా ఉండగా జిల్లాలోని ప్రభుత్వ, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలల సంరక్షణ కేంద్రాలను అదనపు కలెక్టర్, ఆరుగురు సభ్యులతో కూడిన కమిటీ నేతృత్వాన ఈనెల 23 నుంచి 28వ తేదీ వరకు తనిఖీ చేయనున్నట్లు వివరించారు. జిల్లా సంక్షేమ అధికారి రాజమణి మాట్లాడుతూ హెల్త్ ప్రొఫైల్స్‌కు సంబంధించిన ఫార్మాట్‌ను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సమన్వయంతో రూపొందించి అన్ని సంస్థలు ఒకే విధంగా నిర్వహించేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ కె.లలితా దేవి, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు సందసాని రాజేంద్రప్రసాద్, జిల్లా బాలల పరిరక్షణ ఇన్‌చార్జ్ అధికారి ఎస్.ప్రవీణ్‌కుమార్, ప్రొటెక్షన్ ఆఫీసర్ మౌనిక, శిశు గృహ మేనేజర్ డి.నగేష్, జిల్లా ఇన్‌స్పెక్షన్ కమిటీ సభ్యులు ఎర్ర శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి

ఎంజీఎం ఆస్పత్రికి అత్యాధునిక వైద్య పరికరాలు

- ముందుకు వచ్చిన పవర్ గ్రిడ్ కార్పొరేషన్
- సమీక్షలో కలెక్టర్ డాక్టర్ సత్య శారద

వరంగల్: వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి అత్యాధునిక వైద్య పరికరాలు సమకూర్చేందుకు పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ ముందుకు వచ్చిందని కలెక్టర్ డాక్టర్ సత్య శారద తెలిపారు. కలెక్టరేట్ చాంబర్‌లో శుక్రవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఎంజీఎం సూపరింటెండెంట్ మురళి, ఆర్‌ఎంఓ మురళి పవర్ గ్రిడ్ కార్పొరేషన్ డీజీఎం సమ్మయ్యతో కలెక్టర్ పలు అంశాలపై చర్చించారు. సీఎస్‌ఆర్ పనుల కింద వైద్య పరికరాలు సరఫరా చేసేందుకు ముందుకొచ్చిన పవర్ గ్రిడ్ అధికారులను కలెక్టర్ అభినందించారు. ఇందులో భాగంగా ఎంజీఎం ఆస్పత్రికి కావాల్సిన పరికరాల నివేదికలు సమర్పించాలని సూపరింటెండెంట్ మురళిని ఆదేశించారు. సమావేశంలో డీఎంహెచ్‌ఓ వెంకటరమణ, వరంగల్ తహసీల్దార్ ఇక్బాల్, పవర్‌గ్రిడ్ జూనియర్ ఇంజినీర్ సీహెచ్.సంపత్ తదితరులు పాల్గొన్నారు.



పవర్ గ్రిడ్ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సత్య శారద

ఏఈఓల సమస్యలు పరిష్కరించాలి



హనుమకొండ జిల్లా వ్యవసాయాధికారి రవీందర్‌సింగ్‌కు వినతిపత్రం ఇస్తున్న ఏఈఓలు

హన్మకొండ: తమ సమస్యలు పరిష్కరించాలని వ్యవసాయ విస్తరణాధికారులు డిమాండ్ చేశారు. లేకపోతే ఈనెల 27 నుంచి ఆందోళన బాట పడతామని హెచ్చరించారు. శుక్రవారం హనుమకొండలో జిల్లా వ్యవసాయాధికారి రవీందర్‌సింగ్‌ను జిల్లాలోని ఏఈఓలు కలిసి వినతిపత్రం అందించారు. తమ సమస్యల్ని ఈనెల 26లోపు పరిష్కరించాలని కోరారు. ప్రతీ 1,000 ఎకరాలకు గ్రామ వ్యవసాయ సహాయకుడిని నియమించాలని, డిజిటల్ క్రాప్ సర్వే చేసేందుకు అవసరమైన ట్యాబ్, మొబైల్ ఫోన్ ఇతర మెటీరియల్ సమకూర్చాలని, పెండింగ్‌లో ఉన్న ఇతర సమస్యలు పరిష్కరించాలని విన్నవించారు. కార్యక్రమంలో వీఈఓలు పి.రాజు, జగదీశ్వర్, టి.సుమలత, కల్పన, సంధ్య, సువర్ణ, ఉషశ్రీ, ప్రతాప్, అహ్మద్ పాషా, రాకేశ్, హరీశ్‌తో పాటు జిల్లాలోని ఏఈఓలంతా పాల్గొన్నారు.

'మహా' సంకల్పానికి సహకరించాలి

- మేయర్ సుధారాణి, కమిషనర్ అశ్విని తానాజీ వాకడే
- భూగర్భ డ్రెయినేజీ, వరద నీటి పారుదలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్

వరంగల్ అర్బన్ : వరంగల్ మహా నగరంలో భూగర్భ డ్రెయినేజీ, వరద నీటి పారుదల వ్యవస్థకు నిపుణులు, వివిధ శాఖల అధికారులు విలువైన సూచనలు చేయాలని మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ అశ్విని తానాజీ వాకడే విజ్ఞప్తి చేశారు. శుక్రవారం వరంగల్ బల్దియా ప్రధాన కార్యాలయంలో తాగునీటి వనరుల నిర్వహణ, ఆక్విఫర్ మేనేజ్‌మెంట్ ప్లాన్ బ్లూ–గ్రీన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రూపకల్పనకు బెంగళూరుకు చెందిన శుభ్ కన్సల్టెన్సీ ప్రతినిధులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రాజెక్టు వివరాలను వెల్లడించారు. ఈసందర్భంగా మేయర్ మాట్లాడుతూ హైదరాబాద్ తర్వాత రెండవ అతిపెద్ద మహా నగరమైన వరంగల్ సమగ్ర అభివృద్ధిపై సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా దృష్టి సారించారని పేర్కొన్నారు. మౌలిక సదుపాయాల కల్పనతోపాటు సిటీ ఇమేజ్ పెంచేందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించడానికి ఆదేశాలు జారీ చేశారని చెప్పారు. నగరంలో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ వ్యవస్థ ఏర్పాటు చేయడానికి కన్సల్టెంట్లను ఆహ్వానించామని, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేస్తేనే వ్యవస్థ సఫలం అవుతుందన్నారు. భూసేకరణ వంటి అంశాల్లో ఇబ్బందులు ఉండవన్నారు. స్మార్ట్ సిటీ ద్వారా కొత్త రోడ్లు ఏర్పాటు చేశామని, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ(యూజీడీ) ఏర్పాటు జరగాలన్నారు. కమిషనర్ అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ.. నగరంలో ఏర్పాటుకు డీపీఆర్ రూపొందించే క్రమంలో వివిధ విభాగాల అధికారులు భాగస్వామ్యం కావాలని సూచించారు. ఈ సందర్భంగా ఎస్పీడీసీఎల్ , ఆర్‌అండ్‌బీ, టౌన్ ప్లానింగ్, బల్దియా ఇంజనీరింగ్, 'కుడా', ట్రాఫిక్ పోలీసు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, ఇరిగేషన్, ఎన్‌ఐటీకి చెందిన అధికారులు అభిప్రాయాలు వ్యక్తపరిచారు. సమావేశంలో సీజీఎం ఆపరేషన్స్ కిషన్, 'కుడా' సీఈఓ అజిత్‌రెడ్డి, పీఎంహెచ్‌ఓ డాక్టర్ రాజేశ్, కార్యదర్శి విజయలక్ష్మి, ఇన్‌చార్జ్ ఎస్‌ఈ రాజయ్య, ఇన్‌చార్జ్ సిటీ ప్లానర్ రవీందర్ రాడెకర్, ఎన్పీడీసీఎల్ ఎస్‌ఈ మధుసూదన్‌రావు, పబ్లిక్ హెల్త్ ఎస్‌ఈ శ్రీనివాసరావు, డిప్యూటీ కమిషనర్ ప్రసన్నరాణి, ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ, పీసీబీ ఈఈ సునీత, ఆర్ అండ్‌బీ ఈఈ సురేష్‌బాబు పాల్గొన్నారు.



కన్సల్టెన్సీ ప్రతినిధుల సమావేశంలో పాల్గొన్న మేయర్, కమిషనర్ ఇతర అధికారులు

పెద్దమ్మగడ్డలో దళితుల ధర్నా

- సమాధులు కూల్చిన వారిపై చర్యలకు డిమాండ్
- గొంతుకోసుకున్న యువకుడు..

హన్మకొండ చౌరస్తా: దళితుల సమాధులను కూల్చివేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం హనుమకొండ–ములుగు జాతీయ రహదారిపై పెద్దమ్మగడ్డకు చెందిన దళితులు ధర్నా నిర్వహించారు. ఏడు దశాబ్దాలకుపైగా బంధువులు, కుటుంబ సభ్యులను అక్కడే సమాధి చేస్తున్నామని, ఇప్పుడు కొందరు ఆ స్థలం తమదేనంటూ వచ్చారని, అధికారులు వారికి వత్తాసు పలుకుతున్నారని మండిపడ్డారు. ధర్నాతో ట్రాఫిక్ స్తంభించగా పోలీసులు చేరుకుని న్యాయం చేస్తామని చెప్పినా వినకుండా భీష్మించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి వచ్చి దళితులతో మాట్లాడారు. సమాధులను కూల్చుతుంటే అధికారులు చోద్యం చూస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు. తప్పుడు పత్రాలతో కబ్జాకు యత్నించే వారిపై చట్టపరమైన చర్యలకు కృషి చేస్తానని చెప్పారు.

గొంతు కోసుకున్న యువకుడు

ఇదిలా ఉండగా మెల్‌గిబ్సన్ అనే యువకుడు కుటుంబీకుల సమాధులు తొలగించడంతో మనస్తాపానికి గురై గొంతు కోసుకుని ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడు. ధర్నా వద్ద ఉన్న వారు అతడిని ఆస్పత్రికి తరలించారు. అనంతరం సమాధులను తొలగించిన వారిని గుర్తించి వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.



ధర్నా చేస్తున్న వారితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

నాగుపాములు తరలిస్తున్న వ్యక్తిపై కేసు


నాగుపాములతో పట్టుబడిన యాకూబ్

న్యూశాయంపేట : అక్రమంగా రెండు నాగుపాములను తరలిస్తున్న వ్యక్తిపై వైల్డ్‌లైఫ్ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేసినట్లు అటవీశాఖ వరంగల్ రేంజ్ అధికారి సందీప్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. గురువారం వరంగల్ బస్టాండ్ ఆవరణలో రాయపర్తి మండలం సన్నూరు గ్రామానికి చెందిన సయ్యద్ యాకూబ్ రెండు నాగుపాములు (కోరలు తీసిన)ను ప్రజల ముందు ఉంచి షో చేస్తూ డబ్బులు వసూలు చేస్తున్నాడని తెలుసుకుని అతడిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. విచారించి వైల్డ్‌లైఫ్ యాక్ట్–1972 క్రింద కేసు నమోదు చేసి రిమాండ్ కోసం మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచినట్లు ఆయన తెలిపారు. చీఫ్ వైల్డ్‌లైఫ్ వార్డెన్ అనుమతి లేకుండా ఏదైనా వన్యప్రాణులు అక్రమంగా నిర్బంధించినట్లయితే నేరమని అటువంటి వ్యక్తులపై వైల్డ్‌లైఫ్ యాక్ట్ ప్రకారం కేసులు నమోదు చేస్తామని సందీప్‌రెడ్డి తెలిపారు. నిందితుడిని పట్టుకున్న వారిలో డిప్యూటీ ఎఫ్ఆర్ఓ సాంబు, ఎఫ్‌బీఓ శ్రీను, తదితరులు ఉన్నారు.

ఎస్సీ ఎస్టీ అట్రాసిటి కేసుపై ఏసీపీ విచారణ


పత్తిపాకలో విచారణ చేస్తున్న ఏసీపీ కిషోర్‌కుమార్

శాయంపేట : శాయంపేట పోలీస్‌స్టేషన్‌లో ఇటీవల నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసుపై శుక్రవారం పరకాల ఏసీపీ కిషోర్‌కుమార్ విచారణ చేపట్టారు. మండలంలోని పత్తిపాక గ్రామానికి చెందిన దైనంపల్లి మల్లికార్జున్ 2021లో అదే గ్రామానికి చెందిన రైతు వంగ కొమురయ్య నుంచి 22 గుంటల వ్యవసాయ భూమి కొనుగోలు చేశాడు. అదే గ్రామానికి చెందిన పక్క భూమి రైతులైన చల్లా సాంబరెడ్డి, చల్లా భాస్కర్‌రెడ్డి.. మల్లికార్జున్‌ను కులం పేరుతో దూషించి హద్దురాళ్లు తీయించేశారు. ఈ ఘటనపై మల్లికార్జున్ ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను సంప్రదించగా కమిషన్ ఆదేశాల మేరకు సాంబరెడ్డి, భాస్కర్‌రెడ్డిపై ఎస్సై ప్రమోద్‌కుమార్ ఇటీవల ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేశారు. ఈ కేసుపై శుక్రవారం ఏసీపీ పత్తిపాక గ్రామ పంచాయతీ కార్యాలయంలో సాక్షులను విచారించి వాంగ్మూలాలు తీసుకున్నారు. ఏసీపీ వెంట శాయంపేట సీఐ రంజిత్‌రావు, ఎస్సై ప్రమోద్‌కుమార్ పాల్గొన్నారు.

ఎస్సైపై యువకుడి దాడి

మహబూబాబాద్ రూరల్ : ఎస్సైపై యువకుడు దాడిచేసిన సంఘటన మహబూబాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. పి.వెంకట్రాములు మహబూబాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో సెకండ్ ఎస్సైగా పనిచేస్తున్నారు. జమాండ్లపల్లిలో సోహెల్ అనే వ్యక్తిపై ఫిర్యాదురాగా వివరాల సేకరణ నిమిత్తం అతడిని స్టేషన్ పిలిపించారు. సోహెల్ వెంట గ్రామానికి చెందిన పిట్టల నవీన్ కూడా వచ్చాడు. సోహెల్ తో సెకండ్ ఎస్సై వెంకట్రాములు మాట్లాడుతుండగా నవీన్ తన సెల్‌ఫోన్‌తో వీడియో చిత్రీకరించడానికి ప్రయత్నించగా.. అక్కడే విధుల్లో ఉన్న కానిస్టేబుల్ వీడియో ఎందుకు తీస్తున్నావని అడగగా దురుసుగా ప్రవర్తించాడు. ఈ క్రమంలో సెల్ ఫోన్ లాక్కోబోయిన సెకండ్ ఎస్సై వెంకట్రాములతో ఘర్షణ పడ్డాడు. ఈ ఘటనలో వెంకట్రాములు ఎడమచేతి ఉంగరం వేలు విరిగింది. అంతలోనే నవీన్ అక్కడి నుంచి పరారయ్యాడు. ఈ సంఘటనపై సెకండ్ ఎస్సై వెంకట్రాములు మహబూబాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు సీఐ పెండ్యాల దేవేందర్ తెలిపారు.

పన్ను కార్డంటూ పైసలు స్వాహా..

సింజెంటా కంపెనీ పేరుతో సైబర్ మోసం
- వ్యవసాయ ఆధారిత పరికరాలపై పెట్టుబడితో వల..
- పదింతలు అవుతుందంటూ భారీ ఆఫర్లు
- వరంగల్‌తో పాటు ఇతర జిల్లాల్లోనూ వందలాది మంది బాధితులు

సాక్షి, వరంగల్ : చెమట చిందకుండా.. చొక్కా నలగకుండా సులువుగా డబ్బు సంపాదించొచ్చని తెలిస్తే.. కూర్చున్న చోటు నుంచే వేలు పెట్టుబడి పెడితే చాలు.. పదింతలు ఆదాయం వస్తుందంటే ఎవరూ ఎగిరి గంతేయరు..ఈ ఆశనే సైబర్ నేరగాళ్లు క్యాష్ చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. ప్రముఖ కంపెనీల పేర్లున్నట్లు ఒకటి, రెండు అక్షరాలు తప్పించి ఆన్‌లైన్ ద్వారానే గొలుసు కట్టు వ్యాపారం నిర్వహిస్తూ రోజుల వ్యవధిలో రూ.కోట్లు కొల్లగొడుతున్నారు. బాధితులు తమకు నష్టమొచ్చింది రూ.ఐదు వేలు, రూ.పది వేలు.. ఇలా రూ.లక్ష వరకు కోల్పోయినా పోలీసులకు ఫిర్యాదు చేస్తే ఇబ్బందుల పాలవుతామోనని ఆలోచనతో ముందుకు రావడం లేదు. గతంలో జాన్సన్ అండ్ జాన్సన్ కంపెనీ పేరుతో ఇలాంటి సైబర్ మోసం 'సాక్షి' వెలుగులోకి తీసుకొచ్చిన కథనం ఆధారంగా వరంగల్ కమిషనరేట్ పోలీసులు విచారణ కూడా చేశారు. ఇప్పుడూ ఇదే తరహాలో అంటే కాస్తా సరికొత్త ఆలోచనలతో ఈజీ మనీ క్యాష్ బలహీనతను 'సింజెంటా' కంపెనీ పేరును వాడుకుని డబ్బులు కొట్టేస్తుండడం చర్చనీయాంశంగా మారింది. ఒక్క వరంగల్ జిల్లాలోనే కాదు భూపాలపల్లి, ములుగు, హనుమకొండ, జనగామ, కరీంనగర్, నల్లగొండతో పాటు హైదరాబాద్ లోనూ వందల సంఖ్యలో బాధితులుండడం సంచలనంగా మారింది. ఒక్కొక్కరు రూ.ఐదు వేల నుంచి రూ.లక్ష వరకు పెట్టుబడులు పెట్టి, అది కూడా తమకు తెలిసినవారితోనూ ఈ బిజినెస్ చేయించడం గమనార్హం.

ఎలా ఆకట్టుకుంటున్నారంటే..


లింక్ లోని హోంపేజీ ఆఫర్లు ఇవే

వ్యవసాయ ఉత్పత్తుల పేరుతో...

సింజెంటా కంపెనీ వ్యవసాయానికి సంబంధించిన కంపెనీ కావడంతో చాలా మంది ఈ యాప్ లో నిక్షిప్తం చేసిన వ్యవసాయ పరికరాలను కూడా కొనుగోలు చేశారు. వరంగల్‌కు చెందిన ఓ వ్యక్తి ఈ సింజెంటా కంపెనీని నమ్మి రూ.5,200 చెల్లించి షుగర్ క్రేన్ ట్రాక్టర్‌పై పెట్టుబడి పెట్టారు. రోజుకు రూ.2,210 ఆదాయం వస్తుందని, పది రోజుల్లో రూ.22,100 బ్యాంకు ఖాతాల్లో జమ అవుతాయని నమ్మించారు. అయితే రెండు రోజుల్లోనే పెట్టుబడి పెట్టే డబ్బులు వస్తున్నాయనే ఉద్దేశంతో తానే కాకుండా తన పరిచయస్తులతోనూ ఇందులో ఇన్వెస్ట్ చేయించాడు. ఆ డబ్బులు రాకపోవడంతో మోసపోయానని తెలుసుకున్నాడు. అలాగే హనుమకొండకు చెందిన మరో వ్యక్తి పే ట్యాక్స్ రూ.9,500 చెల్లిస్తే రోజు ఆదాయం రూ.2,375 పది రోజుల వరకు రూ.23,750 వస్తాయని ఆన్‌లైన్ ద్వారా డబ్బులు చెల్లించారు. ఇలా వందలాది మంది సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కుకొని రూ.కోట్లు మోసపోయారని తెలిసింది.

75 వసంతాల ఆజాదీకా అమృత్ మహోత్సవ్ అంటూ గూడ్స్ అండ్ సర్వీసెస్ ట్యాక్స్ (జీఎస్టీ) పేరుతో పే ట్యాక్స్ అంటే 2,900, 9,500,15,000, 25,000 అంటూ ఆఫర్లను ప్రకటించారు. రూ.2,900 చెల్లిస్తే రోజు ఆదాయం రూ.290 అని 20 రోజుల్లో రూ.5,800 మీ బ్యాంకు ఖాతాల్లో జమ అవుతాయని పేర్కొన్నారు.

సింజెంటా కంపెనీ అంటూ.. సింజమిక్ లింక్‌తో..

'భారత ఆర్థిక మంత్రిత్వ శాఖ పన్ను తనిఖీలు ప్రారంభించినప్పటి నుంచి మా సింజెంటా కంపెనీ పన్నులను ఎస్‌బీఐకి చెల్లించమని కోరింది. ఈ పన్ను వ్యవహారాలను మా కంపెనీ ఆర్థిక శాఖ పూర్తి చేసింది. అందుకే మా కంపెనీ పన్ను కార్డును విక్రయించాలని నిర్ణయించుకుంది. ఇది కొనుగోలు చేసి మీరు అపరిమితంగా ఆదాయం సంపాదించుకోవచ్చు' అంటూ సైబర్ నేరగాళ్లు పే ట్యాక్స్ పేరుతో ఆఫర్లు ఉన్నాయంటూ-www-itsyngemic.top లింక్ ను తొలుత ప్రచారంలోకి తీసుకొచ్చారు. పన్ను కార్డులు పరిమితంగా ఉన్నాయని, సెప్టెంబర్ 16న 17.00 గంటలకు విడుదల చేస్తామని, ఐదువేల కార్డులు విక్రయానికి పరిమితమని పేర్కొన్నారు. రూ.25వేల పన్ను కార్డు కొనుగోలు చేసి చెల్లించిన తర్వాత మీరు సింజెంటాలో ప్రీమియం సభ్యులు అవుతారని తెలిపారు. ఇలా వాట్సాప్ ద్వారా ఈ లింక్ వేలాది మందికి చేరడంతో ఇది నిజమనుకున్నా చాలామంది క్యాష్ చేసుకుందామని మోసపోయారు. ఇందులో చేరిన చాలా మంది ఇన్విటేషన్ కూపన్ ఇతరులకు పంపించి ఇంకా వేలాది మంది మోసపోయేందుకు కారణమవడం గమనార్హం.

రూ.9,500 చెల్లిస్తే రోజు ఆదాయం రూ.2,375 పది రోజుల వరకు రూ.23,750, రూ.15,000 చెల్లిస్తే రోజుకు ఆదాయం రూ.4,050 వస్తుందని, పది రోజుల్లో రూ.40,500 క్రెడిట్ అవుతాయని ఆఫర్ ప్రకటించారు. రూ.25,000 చెల్లిస్తే రోజుకు రూ.7,500 ఆదాయం వస్తుందని, పది రోజుల్లో రూ.75,000 మీ బ్యాంకు ఖాతాల్లో జమ అవుతాయని ఊరించారు. ఇది నమ్మిన వేలాది మంది పే ట్యాక్స్ కార్డులకు ఆన్‌లైన్ చెల్లింపులు చేసి రూ.కోట్లు మోసపోయారని తెలిసింది.

అకాల వర్షం.. తడిసిన మక్కలు

కేసముద్రం: అకాల వర్షం.. మక్క రైతుల ఆశలను ఆగం చేసింది. చేతికొచ్చిన పంటను అమ్మేందుకు మార్కెట్‌కు తీసుకెళ్లగా ఒక్కసారిగా వర్షం కురిసింది. దీంతో మక్కలు తడిసి ముద్దయ్యాయి. ఈ ఘటన శుక్రవారం కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లో చోటుచేసుకుంది. చుట్టుపక్కల గ్రామాల నుంచి రైతులు మక్కలు అమ్మేందుకు మార్కెట్‌కు తీసుకొచ్చారు. పంటలో తేమ ఉండడంతో ఓపెన్ యార్డుల్లో ఆరబోసుకున్నారు. ఈ క్రమంలో సాయంత్రం ఒక్కసారిగా వర్షం కురవడంతో పరుగుపరుగున టార్పాలిన్లు, పరదాలు తీసుకొచ్చారు. అప్పటికే తడిసి ముద్దయ్యాయి. సుమారు వెయ్యి బస్తాలు తడిసినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, శుక్రవారం 2724 బస్తాల మక్కలు అమ్మకానికి రాగా గరిష్ట ధర రూ.2704, కనిష్ట ధర రూ.2051 పలికింది.


మార్కెట్‌లో తడిసిన మక్కలను దగ్గరకు చేరుస్తున్న మహిళా రైతు

పిడుగుపాటుతో యువకుడి మృతి

- పాతపోచారంలో ఘటన

గార్ల: పిడుగు పాటుకు గురై ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన శుక్రవారం మండలంలోని పాతపోచారంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన అల్లం ప్రవీణ్(19) వర్షం వస్తుండడంతో పొలంలో ఉన్న తన తల్లి కోటేశ్వరిని ఇంటికి తీసుకొచ్చేందుకు బైక్‌పై వెళ్లాడు. తల్లిని ఇంటికి తీసుకొస్తున్న క్రమంలో చెట్టుకిందకు వెళ్లి నిలబడ్డారు. ఒక్కసారిగా ఉరుములు మెరుపులతో పిడుగు చెట్టుపై పడడంతో ప్రవీణ్ కిందపడి స్పృహ కోల్పోయాడు. తల్లి సైతం అపస్మారక స్థితిలోకి వెళ్లింది. కాసేపటి తర్వాత తల్లికి స్పృహ రావడంతో లేచి చూసేసరికి కుమారుడు కిందపడి ఉన్నాడు. తల్లి లబోదిబోమంటూ కుమారుడిపై పడి రోదిస్తుండడంతో పక్కపొలం రైతులు వచ్చి వెంటనే గ్రామంలోని ఆర్ఎంపీ వద్దకు తీసుకెళ్లారు. అనంతరం ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లాలని సూచించారు. దీంతో అక్కడికి తీసుకెళ్లగా ప్రవీణ్ మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కాగా, మృతుడు గార్లలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫైనలియర్ చదువుతున్నాడు.


ప్రవీణ్ (ఫైల్)

పురుగుల మందు పిచికారీ చేస్తూ రైతు..

చిట్యాల: పత్తి చేనుకు పురుగుల మందు పిచికారీ చేస్తూ ఎండ వేడిమికి తట్టుకోలేక ఓ రైతు మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని చల్లగరిగలో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బండారి సదయ్య (65) నాలుగు ఎకరాల్లో పత్తి పంట వేశాడు. రెండు రోజుల నుంచి పత్తి పంటకు పురుగుల మందు పిచికారీ చేస్తున్నాడు. ఈక్రమంలో శుక్రవారం కూడా పిచికారీ చేస్తూ అదే చేనులో కుప్పకూలాడు. దీంతో అతడి భార్య సరోజన చూసి కేకలు వేయడంతో చుట్టు పక్కల వారు వచ్చి ఆస్పత్రికి తరలిస్తుండగానే మృతి చెందాడు. మృతిడికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉంది.


సదయ్య మృతదేహం

338 కిలోల గంజాయి పట్టివేత

- ఒకరి అరెస్ట్.. పరారీలో ఇద్దరు
- వివరాలు వెల్లడించిన సీపీ అంబర్ కిషోర్ ఝా


ట్రాక్టర్ కింద ఏర్పాటు చేసిన డబ్బాలో దాచి ఉంచిన గంజాయి

వరంగల్ క్రైం : నిషేధిత గంజాయిని హసన్‌పర్తి, యాంటీ డ్రగ్స్ వరంగల్ విభాగం పోలీసులు సంయుక్తంగా పట్టుకున్నారు. రూ.85 లక్షల విలువైన 338 కిలోల గంజాయి, ఒక ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా శుక్రవారం కమిషనరేట్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తూర్పు గోదావరి జిల్లా వైరామవరం పాతకోటకు చెందిన కిలో లక్ష్మీనారాయణ ఈనెల 17న ఒడిశా రాష్ట్రం చీతరకొండ మండలం నాటుగురు వద్ద 338 కిలోల గంజాయిని 96 ప్యాకెట్లుగా చేసి ట్రాక్టర్ ట్రాలీ అడుగు భాగంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఒక డబ్బాలో పెట్టారు. గంజాయిని కామారెడ్డి జిల్లా భిక్కనూరుకు చేర్చేందుకు భద్రాచలం, ములుగు, హనుమకొండ మీదుగా సిద్దిపేటకు వెళ్తున్నారు. ఈ క్రమంలో గురువారం అనంతసాగర్ వద్ద హసన్‌పర్తి పోలీసులు, యాంటీ డ్రగ్స్ వరంగల్ విభాగం అధికారులు తనిఖీ చేస్తుండగా ఎస్సై దేవేందర్‌కు అనుమానం వచ్చి ట్రాక్టర్‌ను పరిశీలించడంతో గంజాయి లభించింది. ట్రాక్టర్ డ్రైవర్ లక్ష్మీనారాయణను విచారించగా అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన కిలో నారాయణ, గంజాయి అందజేసిన మరో వ్యక్తి పరారీలో ఉన్నట్లు సీపీ తెలిపారు. పెద్ద మొత్తంలో గంజాయి పట్టుకోవడంలో ప్రతిభ కనబర్చిన తెలంగాణ యాంటీ డ్రగ్స్ విభాగం ఏసీపీ సైదులు, కాజీపేట ఏసీపీ తిరుమల్, తెలంగాణ యాంటీ డ్రగ్స్ వరంగల్ ఇన్‌స్పెక్టర్ సురేశ్, హసన్‌పర్తి ఇన్‌స్పెక్టర్ చేరాలు, ఎస్సైలు దేవేందర్, రవి, సిబ్బందిని వరంగల్ పోలీస్ అంబర్ కిషోర్ ఝా అభినందించారు. విలేకరుల సమావేశంలో సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా, ఏసీపీలు కొత్త దేవేందర్‌రెడ్డి, నందిరాం నాయక్ పాల్గొన్నారు.


నిందితుడి అరెస్ట్ చూపుతున్న సీపీ

పోక్సో కేసు నమోదు

ఆత్మకూరు: బాలికకు మాయమాటలు చెప్పి వివాహం చేసుకున్న ఓ యువకుడిపై శుక్రవారం ఆత్మకూరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. మండలానికి చెందిన ఓ బాలికకు ఈనెల 16వ తేదీన కోల రాకేశ్ అనే యువకుడు మాయమాటలు చెప్పి బైక్‌పై తీసుకెళ్లి వివాహం చేసుకున్నాడు. ఈ క్రమంలో సదరు బాలిక తల్లిదండ్రుల వద్దకు వెళ్తానని చెప్పడంతో 17వ తేదీన గూడెప్పాడ్‌లో వదిలేశాడు. దీంతో బాలిక ఫోన్ చేయగా తల్లిదండ్రులు తమ ఇంటికి తీసుకెళ్లారు. అనంతరం కోల రాకేశ్‌పై ఫిర్యాదు చేయగా ఆత్మకూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లక్ష్మీ పారాబాయిల్డ్ రైస్ మిల్లుపై దాడులు

- సివిల్ సప్లైకి సరఫరా కాని 18 వేల క్వింటాళ్ల బియ్యం
- సుమారు రూ.6.49 కోట్ల ధాన్యం నిల్వలు మాయం
- మిల్లు యజమానిపై క్రిమినల్ చర్యలకు ఆదేశాలు

మరిపెడ రూరల్: మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం ఎల్లంపేట శివారులోని లక్ష్మీపారాబాయిల్డ్ రైస్ మిల్లుపై రాష్ట్ర సివిల్ సప్లై విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్ ఫోర్స్ అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించారు. రాష్ట్ర సివిల్ సప్లై ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్‌ఫోర్స్ ఓఎస్డీ ఎం.ప్రభాకర్‌రావు కథనం ప్రకారం.. 2022–23 రబీ సీజన్‌కు లక్ష్మీ పారాబాయిల్డ్ రైస్ మిల్లుకు ఎఫ్‌సీఐ నుంచి 62,578 క్వింటాళ్ల ధాన్యం కేటాయించారు. సదరు మిల్లు యజమాన్యం రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసి పట్టించి 42,553 క్వింటాళ్ల బియ్యం సివిల్ సప్లై కోటా కింద సరఫరా చేయాలి. కానీ కేవలం 24,333 క్వింటాళ్ల బియ్యం మాత్రమే సరఫరా చేసి, మిగతావి పంపకపోవడంతో ఎఫ్‌సీఐ అనుమతి నిలిపివేసింది. మిగతా 18,216 క్వింటాళ్ల బియ్యం సరఫరాకు సంబంధించి 26,784 క్వింటాళ్ల ధాన్యం మిల్లులో నిల్వ ఉండాలి. కన్వర్ట్ చేస్తే 66,970 ధాన్యం బస్తాలు మిల్లులో నిల్వ ఉండాలి. కానీ మిల్లులో ఒక్క ధాన్యం, బియ్యం గింజ కూడా లేదు. ఈ ఏడాది ఆర్థిక సమీకరణాలు అనుసరించి సుమారు రూ.6,49,033 కోట్ల అవకతవకలు జరిగినట్లు అధికారులు గుర్తించారు. దీనికి సంబంధించిన మిల్లు యజమానిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని, స్థానిక పోలీసులు, సివిల్ సప్లై జిల్లా మేనేజర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. డీఎం కృష్ణవేణి, ఎస్సై జంగయ్య, డీసీఎస్సీ ప్రేమ్ కుమార్, ఏఎస్ఓ రమేశ్, టీపీ శంకరయ్య, మరిపెడ తహసీల్దార్ సైదులు, ఎస్సై సతీశ్ పాల్గొన్నారు.


రైస్ మిల్లులో తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ అధికారులు

పున్నేలులో ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్..

ఐనవోలు: మండలంలోని పున్నేలులో నారాయణ ఆగ్రో ఇండస్ట్రీలో సివిల్ సప్లై ఎన్‌ఫోర్స్‌మెంట్ ప్రత్యేక అధికారి లక్ష్మారెడ్డి నేతృత్వంలో శుక్రవారం తనిఖీలు చేపట్టారు. సివిల్ సప్లై డీటీ నాగేంద్రప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. సీఎంఆర్‌లో భాగంగా నారాయణ ఆగ్రో ఇండస్ట్రీ ప్రభుత్వానికి 58 వేల ధాన్యం బస్తాలు పెట్టాల్సి ఉందన్నారు. ఈ క్రమంలో యాజమాన్యానికి పలుమార్లు నోటీసులు ఇవ్వగా స్పందించలేదన్నారు. దీంతో రికవరీ కోసం తనిఖీలు చేపట్టగా 7,641 బస్తాలు మాత్రమే నిల్వ ఉండగా 50వేల 359 ధాన్యం బస్తాలు తక్కువగా ఉన్నట్లు గుర్తించినట్లు చెప్పారు. వీటి విలువ సుమారు రూ.5 కోట్ల వరకు ఉంటుందన్నారు. మిల్లు యాజమాన్యంపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. తనిఖీల్లో హనుమకొండ ఎఫ్ఐ సదానందం, టీపీ కనకాచారి, తదితరులు ఉన్నారు.

వరంగల్‌లో 29 రైళ్లకు హాల్టింగ్ ఎత్తివేత

- ఈ నెల 25 నుంచి అమలు

కాజీపేట రూరల్: హసన్‌పర్తి–కాజీపేట ఎఫ్ క్యాబిన్–వరంగల్ స్టేషన్ల మధ్య జరిగే నాన్ ఇంటర్‌లాకింగ్ బ్లాక్‌తో విజయవాడ–కాజీపేట–బల్హార్షా–సికింద్రాబాద్ సెక్షన్‌లో పలు రైళ్లకు అంతరాయం ఏర్పడిందని, ఈ నెల 25 నుంచి వరంగల్ మీదుగా ప్రయాణించే 29 రైళ్లకు తాత్కాలికంగా హాల్టింగ్ ఎత్తివేస్తున్నట్లు, 10రైళ్లను కాజీపేట జంక్షన్‌లో హాల్టింగ్ కల్పించనున్నట్లు అధికారులు శుక్రవారం తెలిపారు.

వరంగల్‌లోతొలగించి, కాజీపేటలో హాల్టింగ్

ఈ నెల 25, 26, 27, 28న విజయవాడ–సికింద్రాబాద్ (12739) గరీబ్‌రథ్, సికింద్రాబాద్–విజయవాడ (12740) గరీబ్‌రథ్, ఈ నెల 25న షాలిమార్–సికింద్రాబాద్ (12773) షాలిమార్ ఏసీ, ఈ నెల 26న కాకినాడ టౌన్–లింగంపల్లి (12775) కాకినాడ, ఈ నెల 27న లింగంపల్లి–కాకినాడ టౌన్ (12776) కాకినాడ, ఈ నెల 26న టాటా–యశ్వంత్‌పూర్ వీక్లీ (18111), ఈ నెల 27,28న సికింద్రాబాద్–విశాఖపట్నం (20707) వందేభారత్, ఈ నెల 27,28,29న విశాఖప్నం–20708) వందేభారత్, ఈ నెల 26,27,28న విశాఖపట్నం– సికింద్రాబాద్ (20833) ఈ నెల 26,27,28న సికింద్రాబాద్–విశాఖపట్నం (20834) వరంగల్‌లో హాల్టింగ్ ఎత్తివేసి కాజీపేట జంక్షన్‌లో హాల్టింగ్ కల్పించారు.

29 రైళ్లకు వరంగల్‌లో హాల్టింగ్ ఎత్తివేత

రైల్వే నాన్ ఇంటర్‌లాకింగ్ బ్లాక్‌తో వరంగల్‌లో హాల్టింగ్ ఉన్న 29 రైళ్లకు తాత్కాలికంగా ఈ నెల 25,26,27వ తేదీల వారీగా హాల్టింగ్ ఎత్తివేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు.

కాటేసిన కట్నం రక్కసి

- తల్లిదండ్రులను ఎదిరించి ప్రేమ వివాహం చేసుకున్న యువతి
- కట్నం తేవాలని 8 నెలల గర్భిణిని పుట్టింటికి పంపించిన అత్త, భర్త
- మనస్తాపంతో గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నం
- ఆస్పత్రిలో ఆపరేషన్ చేయగా ఆడ శిశువు జననం
- నెలలు నిండక శిశువు, పరిస్థితి విషమించి తల్లిమృతి


ప్రవళిక(ఫైల్)

నర్సంపేట/దుగ్గొండి: తల్లిదండ్రులను ఎదిరించి ప్రేమ వివాహం చేసుకుంది.. ఏడాదిపాటు కాపురం సాఫీగా సాగింది.. అనంతరం కట్నం తేవాలని అత్తింటి వారి నుంచి వేధింపులు మొదలయ్యాయి. భరించలేక పుట్టింటికి వచ్చిన 8 నెలల ఆ గర్భిణి విషం తాగింది. తల్లిదండ్రులు ఆస్పత్రికి తరలించారు. వైద్యులు ఆమెకు ఆపరేషన్ చేయగా ఆడ శిశువుకు జన్మనిచ్చింది. చికిత్స పొందుతూ శిశువు, మరుసటి రోజు తల్లి మృతి చెందింది. వివరాల్లోకి వెళితే.. వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన ముదురుకోళ్ల సందీప్, అదే మండలం దేశాయిపల్లి గ్రామానికి చెందిన కొల్లూరి ప్రవళిక (22)ను మూడేళ్ల క్రితం పెళ్లి చేసుకున్నాడు. పెద్దలను ఎదిరించి వచ్చిన ప్రవళికను బాగా చూసుకుంటానని నమ్మించాడు. ఏడాదిపాటు మురిపించాడు. తర్వాత వారికి ఓ మగబిడ్డ జన్మించాడు. అన్యోన్యంగా సాగిపోతున్న ఆ కుటుంబంలో కట్నం రక్కసి కరతాళ నృత్యం చేసింది. తనకు రెండు ఎకరాల వ్యవసాయ భూమి, రూ.10 లక్షల కట్నం కావాలని ప్రవళికను సందీప్ వేధించసాగాడు. పెద్ద మనుషుల సమక్షంలో పలుమార్లు పంచాయితీ జరిగినా సందీప్‌లో మార్పు రాలేదు. 8 నెలల గర్భిణి అని చూడకుండా కట్నం తెస్తేనే ఇంటికి రావాలని ప్రవళికను.. భర్త, సందీప్, అత్త విజయ నెల రోజుల క్రితం పుట్టింటికి పంపించారు. మనస్తాపం చెందిన ఆమె ఈనెల 18న గడ్డి మందు తాగగా తల్లిదండ్రులు వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. చావుబతుకుల్లో ఉన్న ఆమె ఆడశిశువుకు జన్మనిచ్చింది. నెలలు నిండక అనారోగ్యంతో పుట్టిన ఆ శిశువు ఈనెల 19న వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చనిపోయింది. శుక్రవారం ఉదయం తల్లి కన్నుమూసింది. కట్నం రక్కసికి ఇద్దరు బలికావడం తీవ్ర విషాదాన్ని నింపింది.

భర్త, అత్తపై కేసు నమోదు..

భర్త సందీప్, అత్త విజయ నిత్యం వేధించడంతోనే తన కూతురు ప్రవళిక ఆత్మహత్య చేసుకుందని తల్లి కొల్లూరి రమ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు దుగ్గొండి ఎస్సై నీలోజు వెంకటేశ్వర్లు శుక్రవారం రాత్రి తెలిపారు.

మెదడువాపుతోనే బాలిక మృతి

- రొయ్యూరు వైద్యాధికారి సుమలత

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని ఆకులవారిఘణపురం ప్రాంతానికి చెందిన కంకణాల గీతిక(6) మెదడువాపు వ్యాధితోనే మృతి చెందినట్లు రొయ్యూరు వైద్యాధికారి సుమలత తెలిపారు. ఈ మేరకు శుక్రవారం గీతిక ఇంటిని వైద్య బృందం సందర్శించి రిపోర్టులు, మృతికి గల కారణాలపై ఆరా తీశారు. గీతిక విషజ్వరంతో మృతి చెందినట్లు పలు పత్రికల్లో కథనాలు ప్రచురితమయ్యాయి. ఈ మేరకు బాలిక రిపోర్టులను పరిశీలించగా మెదడువాపుతో మృతి చెందినట్లు తెలిసిందన్నారు. జ్వరం వచ్చిన వెంటనే వైద్యులు, సిబ్బందిని సంప్రదించి చికిత్స పొందాలన్నారు. సొంత వైద్యాలు చేసుకోవదన్నారు. అదేవిధంగా ఇంటింటా సర్వే చేసి లార్వా ఉన్న నిల్వలను తొలగించామన్నారు. 80 ఇళ్లు చుట్టూ దోమల నివారణ మందు పిచికారీ చేయించామన్నారు. ఈ వర్షాకాలంలో డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వచ్చే అవకాశాలు ఎక్కు వ ఉంటాయన్నారు. ఈ నేపథ్యంలో స్వీయ రక్షణ, మంచినీరు వేడి చేసి తాగాలన్నారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ నర్సింహారావు, ఏఎన్ఎం సమ్మక్క, ఆశ కార్యకర్తలు పాల్గొ


మాట్లాడుతున్న వైద్యురాలు సుమలత

మద్యం మత్తులో వ్యక్తి బలవన్మరణం

- ముచ్చింపుల తండా గ్రామంలో ఘటన


లక్ష్మీనారాయణ (ఫైల్)

నల్లబెల్లి: కుటుంబ సభ్యులు మందలించారని మద్యం మత్తులో ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని ముచ్చింపుల తండా గ్రామంలో జరిగింది. ఎస్సై ప్రశాంత్ బాబు కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన సంకోజు లక్ష్మీనారాయణ(55) కులవృత్తి వడ్రంగి పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. మద్యానికి బానిసైన లక్ష్మీనారాయణ తరచూ కుటుంబ సభ్యులతో మత్తులో గొడవపడేవాడు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం మద్యం తాగి ఇంటికి చేరుకున్న లక్ష్మీనారాయణను కుటుంబీకులు మందలించారు. దీంతో మద్యం మత్తులో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటి ఎదుట ఉన్న రేకుల షెడ్డులో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న కుటుంబీకులు ఇంటికి చేరుకుని బోరున విలపించారు. మృతుడి భార్య పుష్పలీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కోరుకొండపల్లిలో ఎలుకలమందు తాగి యువకుడు..

కేసముద్రం: మద్యం మత్తులో ఓ యువకుడు ఎలుకల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని కోరుకొండపల్లిలో చోటుచేసుకుంది. ఎస్సై మురళీధర్‌రాజు కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మాంకాల రాము(21) ఖాళీగా తిరుగుతూ మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో ఈనెల 15న మద్యం మత్తులో ఎలుకల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. దీంతో మానుకోట జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడి తండ్రి కిష్టయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

జీవితంపై విరక్తి చెంది పాపయ్యపేటలో యువకుడు..


అనిల్ (ఫైల్)

చెన్నారావుపేట : జీవితంపై విరక్తి చెంది ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని పాపయ్యపేటలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన చిరుత అనిల్(30) తల్లిదండ్రులు, సోదరుడు కొద్ది రోజుల క్రితం మృతి చెందారు. అప్పటి నుంచి మనోవేదనకు గురవుతున్నాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది గురువారం రాత్రి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శుక్రవారం ఉదయం చుట్టుపక్కల వారు గమనించి పోలీసులకు సమాచారం అందించగా హెడ్ కానిస్టేబుల్ ఇస్తారి, కానిస్టేబుల్ క్రాంతికుమార్ ఘటనా స్థలికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై మృతుడి వదిన సరిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ ఇస్తారి వెల్లడించారు. కాగా, గ్రామస్తులు చందాలు వేసుకుని అనిల్ అంత్యక్రియలు నిర్వహించారు.

పిడుగుపడి తాడిచెట్టు దగ్ధం

వరంగల్: వరంగల్ నగరంలో శుక్రవారం రాత్రి పడిన వర్షంలో పిడుగుపడి 3వ డివిజన్ ఆరేపల్లిలో తాడిచెట్టు పూర్తిగా దగ్ధమైంది. గ్రామానికి దూరంగా పడడంతో ఎవరికి ప్రాణహానీ కలగలేదని గ్రామస్తులు తెలిపారు.

